రాజకీయ క్రీడకు జన సమీకరణ



నేడు 'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు కార్యక్రమం

- వేదికగా పీఎం పాలెం క్రికెట్ స్టేడియం
- హాజరుకానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి
- 25 వేల మందిని తీసుకురావాలని నేతలకు 'పెద్దల' ఆదేశం
- విశాఖలో వార్డుకు 350 మంది...
- ఒక్క జోన్-3కే 90 బస్సులు...5,000 మంది టార్గెట్
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 585 ఆర్టీసీ బస్సులు

-వార్త

7వ పేజీలో

'పేట' వైసీపీలో అసమ్మతి గళం

- కంబాల జోగులును సమన్వయకర్తగా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ అడ్డరోడ్డులో నిరసన ర్యాలీ
- 'లోకల్ ముద్దు... నాన్-లోకల్ వద్దు' అంటూ నినాదాలు
- ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీకి న్యాయం చేయాలని డిమాండ్



'లోకల్ ముద్దు.. నాన్-లోకల్ వద్దు' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైసీపీ శ్రేణులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 12: రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ టికెట్‌ను స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ మద్దతుదారులు సోమవారం అడ్డరోడ్డులో ర్యాలీ నిర్వహించారు. పాయకరావుపేట సమన్వయకర్తగా విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును వైసీపీ అధిష్ఠానం ఇటీవల నియమించిన నేపథ్యంలో అమ్మాజీ వర్గీయులు నిరసన ర్యాలీ నిర్వహించడం ఈ సందర్భంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. 'లోకల్ ముద్దు.. నాన్-లోకల్ వద్దు' అని రాసివున్న ప్లకార్డులను ప్రదర్శించడమే కాకుండా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కంబాల జోగులుకు పాయకరావుపేట టికెట్ ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో పాయకరావుపేట సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు టికెట్ వుండదని గత కొంతకాలంలో వైసీపీలో ప్రచారం జరుగుతుండడంతో పెదపాటి అమ్మాజీ వైసీపీ టికెట్‌ను ఆశిస్తున్నారు. సుమారు ఏడాది నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వుంటూ నాయకులు, కార్యకర్తలకు దగ్గరవ్వడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'పేట సమన్వయకర్తగా కంబాల జోగులను నియమించడం, వచ్చే ఎన్నికల్లో ఆయనే అభ్యర్థి అవుతారని ప్రచారం ... మిగతా 8వ పేజీలో

ధాన్యం సేకరణలో చతికిల!

రైతుల నుంచి కొనుగోళ్లలో పౌరసరఫరాల సంస్థ విఫలం

- 35 వేల టన్నులు సేకరించాలని లక్ష్యం
- ఇంతవరకు 16,118 టన్నులు మాత్రమే కొనుగోలు
- రైతులకు చెల్లించాల్సింది రూ.35 కోట్లు.. జమ అయ్యింది రూ.16 కోట్లే!
- మరికొద్ది రోజుల్లో ముగియనున్న గడువు



చోడవరం మండలం అంభేరుపురంలో ధాన్యం కొనుగోలు జరగని రైతు భరోసా కేంద్రం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ విషయంలో అధికారులు చేతులెత్తేశారు. మరికొద్ది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ముగించాల్సి వుండగా.. అరకొర లక్ష్యంలో ఇంతవరకు సగం కూడా సేకరించలేదు. ప్రభుత్వానికి ధాన్యం విక్రయిస్తే డబ్బులు ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి, మరోవైపు ప్రైవేటు వ్యాపారులు నేరుగా గ్రామాలకు వచ్చి, ప్రభుత్వ మద్దతు ధరకన్నా ఎక్కువ రేటుకు ధాన్యం కొనుగోలు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పౌర సరఫరాల సంస్థ అధికారులు విశ్లేషిస్తున్నారు.

గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసింది. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో ఆలస్యంగా వరినాట్లు వేసినప్పటికీ తరువాత వర్షాలు ముఖం చాటేయడంతో దాదాపు సగం విస్తీర్ణంలో వరినాట్లు ఎండిపోయాయి. వరి పంట కోత సమయంలో మిచౌంగ్ తుఫాన్ విరుచుకుపడడంతో సుమారు 20 వేల ఎకరాల్లో నీటమునిగి పంట దెబ్బతిన్నది. దీంతో మొత్తం మీద 50 వేల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం సేకరణకు పౌరసరఫరాల సంస్థ అధికారులు ఏర్పాట్లు చేశారు. 343 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 72 క్లస్టర్ కేంద్రాలను ఎంపిక చేశారు. వీటిలో 53 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 19 రైతు ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ కేంద్రాలు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరు 8వ తేదీన ధాన్యం సేకరణ ప్రారంభించారు. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, చివర దశలో తుఫాన్ కారణంగా వరి పంట దెబ్బతినడంతో పౌరసరఫరాల సంస్థ అధికారులు ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 35 వేల టన్నులకు తగ్గించారు. కానీ ఇంతవరకు 16,118 టన్నుల ధాన్యాన్ని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి ఆయా రైతులకు సుమారు రూ.35 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.16 కోట్లు మాత్రమే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. మిగిలిన వారికి గడువులోగా (ధాన్యం విక్రయించిన 30 రోజుల్లో) జమ అవుతాయని జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు.

ఎక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు

గత ఖరీఫ్ సీజన్‌లో కరువు పరిస్థితుల వల్ల వర్షాధార భూముల్లో వరి పైరు ఎండిపోగా, నీటి సదుపాయం వున్న భూముల్లో పంట కోతకు వచ్చిన తరుణంలో తుఫాన్ దెబ్బతీసింది. దీంతో ధాన్యం దిగుబడులు బాగా తగ్గిపోయాయి. దీంతో ప్రైవేటు వ్యాపారులు, దళారులు గ్రామాల్లోకి వచ్చి రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. ప్రభుత్వం క్వింటాకు గ్రేడ్-ఏ రకానికి రూ. 2,203, సాధారణ రకానికి రూ.2,183గా మద్దతు ధర ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ ధరలకన్నా క్వింటాకు వంద నుంచి రెండు వందల రూపాయలు అధికంగా చెల్లించి ప్రైవేటు వ్యాపారులు కొనుగోళ్లు జరిపారు. ఎక్కువ రేటుతోపాటు అక్కడికక్కడే డబ్బులు చెల్లిస్తుండడంతో పలువురు రైతులు ప్రైవేటు వ్యాపారులకే ధాన్యం విక్రయించడానికి ఆసక్తి చూపారు. ధాన్యం సేకరణ నుంచి డబ్బులు చెల్లింపుల వరకు ప్రభుత్వం పలు నిబంధనలు విధించడం కూడా రైతులు ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించడానికి ఒక కారణమని తెలిసింది.

కాగా లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోళ్లు జరపలేకపోవడంపై పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతిని వివరణ కోరగా, డిసెంబరులో తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల వల్ల కొంతమంది రైతులు ఆలస్యంగా నూర్పిడులు చేశారని, ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్లు జరుపుతామని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

స్టేషన్ స్థాయిలోనే న్యాయం జరిగేలా చూస్తా

- మావోయిస్టుల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి
- గంజాయి సాగు, రవాణాను నియంత్రిస్తాం
- రేంజ్ డీఐజీ విశాల్ గున్ని



బాధ్యతలు స్వీకరిస్తున్న విశాల్ గున్ని

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం వచ్చే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్ని అన్నారు. డీఐజీగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన తరువాత విలేకరులతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ స్థాయిలోనే ప్రజలకు న్యాయం జరిగేలా చేయడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. ఆ విధంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. రేంజ్ పరిధిలో ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి అన్ని విభాగాలను పటిష్ఠపరిచేందుకు కృషి చేస్తానన్నారు. పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల్లో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని, ఏజెన్సీలో గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం లేకుండా చర్యలు తీసుకుంటామని, నిబంధనలకు లోబడి పనిచేస్తూ ముందుకువెళతామని చెప్పారు. సామాజిక మాధ్యమాల ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో కథనాలు ప్రచురించే ముందు వివరణ తీసుకోవాలని మీడియాను కోరారు. సోషల్ మీడియాలో కొందరు అత్యుత్సాహం ప్రదర్శించి కథనాలు పోస్టు చేయడం వల్ల ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. అందువల్ల ఒకటికి, రెండుసార్లు నిర్ధారణ చేసుకోవాలని విశాల్‌గున్ని అన్నారు. కాగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అన్ని జిల్లాల ఎస్పీలు, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిశారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- ఉమ్మడి జిల్లాలో 329 ఖాళీలు
- పాఠశాల విద్యాపరిధిలో 99, గిరిజన సంక్షేమ శాఖలో 135 ఖాళీలు
- రెసిడెన్షియల్ పాఠశాలల్లో 95
- ఉమ్మడి జిల్లాలో 35 వేల మంది అభ్యర్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల నుంచి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులను వైసీపీ ప్రభుత్వం నిరాశపరచింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కేవలం 329 ఖాళీలు (అన్ని మేనేజ్‌మెంట్లు కలిపి) ఉన్నట్టు చూపించింది. ఈ మేరకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం పాఠశాల విద్యా శాఖ పరిధిలో జడ్పీ, ప్రభుత్వ, మునిసిపల్ పాఠశాలల్లో 99, గిరిజన ప్రాంతంలో 135, రెసిడెన్సియల్ పాఠశాలల్లో 95 ఖాళీలు ఉన్నట్టు చూపించారు. పాఠశాల విద్యా శాఖ పరిధిలో ఎస్జీటీ పోస్టులు కేవలం 14 మాత్రమే ఉన్నాయి. స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో తెలుగు-7, హిందీ-27, ఇంగ్లిష్-9, గణితం-5, ఫిజికల్ సైన్స్-4, బయాలజీ-6, సోషల్ స్టడీస్-1, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 26..మొత్తం 85 ఖాళీలు ఉన్నాయి. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఎస్జీటీ 87, స్కూలు అసిస్టెంట్లు 47, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఒక స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఉన్నాయి. ఇక ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ) కేటగిరీలో ఏపీ మోడల్ స్కూళ్లలో తొమ్మిది, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో 10, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 23, గిరిజన సంక్షేమ గురుకులాల్లో 44, ఏపీ రెసిడెన్సియల్ పాఠశాలల్లో తొమ్మిది పోస్టులు ఖాళీ ఉన్నాయి. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో టీచర్ ట్రైనింగ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు మొత్తం 35 వేల మంది వరకూ ఉంటారు. గడచిన ఐదేళ్ల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో ఏటేటా అభ్యర్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.

హైవే భూముల్లో గ్రావెల్ దందా



సూరెడ్డిపాలెం వద్ద రింగు రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూముల్లో మట్టి, గ్రావెల్ తవ్వడంతో ఏర్పడిన గోతులు

- సూరెడ్డిపాలెంలో యథేచ్ఛగా తవ్వకాలు, రవాణా
- రింగు రోడ్డు కోసం సేకరించిన భూముల్లో భారీగా గోతులు
- ఫ్లైయాష్‌నూ విడిచిపెట్టని అక్రమార్కులు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్ శాఖల అధికారులు

సబ్బవరం, ఫిబ్రవరి 12: మండలంలోని అమృతపురం శివారు సూరెడ్డిపాలెంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. జాతీయ రహదారి ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో భారీ యంత్రాలతో గ్రావెల్, మట్టి తవ్వి, పెద్ద పెద్ద డంపర్ లారీతో దర్జాగా తరలించుకుపోతున్నారు. వీరికి జాతీయ రహదారి నిర్మాణ సంస్థలో పని చేస్తున్న ఒక వ్యక్తి సహకరిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

అనకాపల్లి-ఆనందపురం, సబ్బవరం-షీలానగర్ (సాగర్ మాల) రోడ్లను కలుపుతూ భారీ రింగు రోడ్డు నిర్మాణానికి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అమృతపురం సర్వే నంబర్లు 285, 286, 288లలో సుమారు 57 ఎకరాలను రెవెన్యూ అధికారులు సేకరించారు. అనంతరం ఎన్‌హెచ్‌ఏఐకి అప్పగించారు. అయితే సాగర మాల రోడ్డు నిర్మాణానికి భూ సేకరణలో జాప్యం జరగడంతో పనులు మొదలు కాలేదు. మరోవైపు రింగు రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన సూరెడ్డిపాలెం రైతులు పరిహారం అంశంపై కోర్టును ఆశ్రయించారు. ఇది ప్రస్తుతం కోర్టు పరిధిలో వుండడంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రోడ్డు పనులు మొదలుపెట్టలేదు. రైతులు పంటలు పండించుకోవడంలేదు. దీంతో అక్రమార్కుల కళ్లు ఈ భూములపై పడ్డాయి. ఎక్స్‌కవేటర్లతో మట్టి, గ్రావెల్ తవ్వి, డంపర్ లారీలు, ట్రాక్టర్లతో రాత్రిపూట ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రైవేటు లే-అవుట్ల అభివృద్ధికి, ల్యాండ్ ఫిల్లింగ్‌కు, గృహనిర్మాణాల్లో పునాదులు ఎత్తుచేయడానికి విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ లోడు అయితే రూ.1,000, లారీ అయితే ... మిగతా 8వ పేజీలో



రింగు రోడ్డుకు కేటాయించిన భూముల్లో ఫ్లైయాష్‌ను కూడా తవ్వేస్తున్న దృశ్యం

శాకంబరి అలంకరణలో శ్యామా అమ్మవారు



శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్యామా అమ్మవారు

సబ్బవరం మండలం దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం శ్యామా అమ్మవారిని శాకంబరి మాతగా అలంకరించారు. సాయంత్రం గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో రాజ శ్యామల అమ్మవారి హోమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. - సబ్బవరం

జీపు బోల్తా ఇద్దరు గిరిజనులు మృతి

- మరో 11 మందికి గాయాలు
- చింతపల్లి మండలం సంపంగిపుట్టు వద్ద ఘటన

-8లో

తుక్కుగా చెత్త వాహనాలు

చిన్నపాటి మరమ్మతులు కూడా చేయించని మునిసిపల్ అధికారులు

- మూలకు చేరిన ఒక ట్రాక్టర్, మూడు వ్యాన్లు, 30కిపైగా తోపుడు బండ్లు
- పది ఎలక్ట్రిక్ ఆటోల్లో రెండే వినియోగం
- చెత్త తరలింపునకు అద్దె ప్రాతిపదికన ట్రాక్టర్లు
- ఏటా రూ.60 లక్షలు చెల్లింపు
- ప్రజాధనం వృథా చేస్తున్నారని విపక్షాలు మండిపాటు



మునిసిపాలిటీ కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా వున్న ఎలక్ట్రిక్ ఆటోలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 12: స్థానిక మునిసిపాలిటీ చెత్త రవాణా వాహనాలు ఒక్కొక్కటిగా మూలకు చేరుతున్నాయి. చిన్నపాటి మరమ్మతులను కూడా సకాలంలో చేయించకపోవడంతో మిగిలిన విడిభాగాలు కూడా పాడైపోయి, వాహనం మొత్తం తుప్పు పట్టిపోతున్నది. వీటిని పక్కన పడేసిన అధికారులు అద్దె ట్రాక్టర్లు వినియోగిస్తూ లక్షల రూపాయల ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారు.

నర్సీపట్నం మునిసిపాలిటీలో సుమారు 20 వేల నివాస గృహాలు వున్నాయి. పారిశుధ్య సిబ్బంది రోజూ వీధుల్లో, ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్నారు. తడి, పొడి చెత్త కలిసి సుమారు 30 టన్నుల వరకు వుంటుంది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు గతంలో నాలుగు ట్రాక్టర్లు, మూడు వ్యాన్లు, 65 తోపుడు బండ్లు వుండేవి. వాహనాలను వినియోగించే క్రమంలో అప్పుడప్పుడు వాటికి చిన్నపాటి రిపేర్లు వస్తుంటాయి. సంబంధిత అధికారులు వీటికి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలి. కానీ స్థానిక మునిసిపాలిటీ అధికారులు, సాంకేతిక సమస్య తలెత్తిన వాహనాలను బాగు చేయించకుండా పక్కన పెట్టేస్తున్నారు. నాలుగు ట్రాక్టర్లకుగాను ఒకటి వినియోగంలో లేదు. మూడు వ్యాన్‌లకుగాను రెండు వ్యాన్లు మూలకు చేరాయి. తోపుడు బండ్లు పాతవి, కొత్తవి కలిపి 65 వుండాలి. కానీ ప్రస్తుతం సగం మాత్రమే వినియోగంలో వున్నాయి.మినీ ఎక్స్‌కవేటర్ కూడా మరమ్మతులకు గురైంది. వీటిని బాగు చేయించకుండా వదిలేయడంతో తుప్పు పట్టి పూర్తిగా పాడవుతున్నాయి.



మరమ్మతులకు గురైన వ్యాన్

ఈ-ఆటోలదీ అదే తీరు!

క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ నుంచి మునిసిపాలిటీకి పది ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరు చేశారు. ఒక్కొక్క ఆటో ఖరీదు రూ.4 లక్షలు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా సేకరించడానికి వీలుగా మూడు అరలు అమర్చారు. అయితే ఆటోలు వచ్చిన కొద్ది రోజుల నుంచి ఏదో కారణంతో వినియోగించకుండా పక్కన పెట్టేస్తున్నారు. పది ఆటోలకు ప్రస్తుతం రెండు ఆటోలు మాత్రమే ... మిగతా 8వ పేజీలో



అచ్యుతాపురం మండలం హరిపాలెంలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న ప్రజలు

అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డును వెంటనే పునర్నిర్మించాలి

- పోరాట కమిటీ డిమాండ్
- పలు గ్రామాల వద్ద నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు

అనకాపల్లి టౌన్/ మునగపాక/ అచ్యుతాపురం, ఫిబ్రవరి 12: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డును వెంటనే పునర్నిర్మించాలని, ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించి ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ పలు గ్రామాల ప్రజలు సోమవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. 'అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ' ఆధ్వర్యంలో అచ్యుతాపురం జంక్షన్, కొండకర్ల, హరిపాలెం, తిమ్మరాజుపేట జంక్షన్, నాగులాపల్లి, ఒంపోలు, తిమ్మరాజుపేట, మునగపాక, అనకాపల్లి బైపాస్ జంక్షన్ ప్రాంతాల్లో ధర్నా, రాస్తారోకోలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం మాట్లాడుతూ, అనకాపల్లి నుంచి అచ్యుతాపురం 15 కి.మీ.లు ప్రయాణించడానికి గంట సమయం పడుతున్నదని, అత్యంత దారుణంగా వున్న ఈ రోడ్డును వెంటనే అభి వృద్ధి చేయకపోతే నిరవధిక నిర్బంధ కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, టీడీపీ, జనసేన, సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి


ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 12: స్థానిక రైల్వే స్టేషన్‌లో రెండో నంబరు ప్లాట్‌ఫారం చివరన పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని యువకుడిని రైలు ఢీకొనడంతో మృతిచెందినట్టు దువ్వాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, వయసు 25 ఏళ్లు ఉండొచ్చని అంచనాగా చెప్పారు. సిమెంట్ రంగుపై గీతలు వున్న బనియన్, బ్లాక్ ట్రాక్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలిస్తామని, ఎవరైనా గుర్తుపట్టినట్టయితే దువ్వాడ జీఆర్‌పీని సంప్రదించాలని కోరారు.

నాటుసారాతో మహిళ అరెస్టు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 12: నాటుసారాతో ఒక మహిళను అరెస్టు చేశామని ఏఎస్ఐ రాజాన అప్పారావు తెలిపారు. తంతడి శివారు వాడపాలెంలో నాటు సారా విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో దాడిచేసి చోడిపల్లి కాసులమ్మను ఐదు లీటర్ల సారాతో పట్టుకున్నామన్నారు.

పోరస్ కంపెనీలో కార్మికుడి మృతి

రాంబిల్లి, ఫిబ్రవరి 12 : ప్రత్యేక ఆర్థిక మండలిలోని పోరస్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు జి.చినఅప్పారావు(49) ఆస్థమా సమస్యతో బాధపడుతూ మృతిచెందాడని సీఐ లక్ష్మణరావు తెలిపారు. వెంకటాపురం గ్రామానికి చినఅప్పారావు కొంతకాలం నుంచి పోరస్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం విధి నిర్వహణలో వుండగా ఆస్థమా సమస్య తలెత్తడంతో మందుబిళ్ల వేసుకొనేందుకు క్యాంటీన్ వద్దకు వస్తూ పడిపోయాడు. సిబ్బంది వెంటనే స్పందించి అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. చినఅప్పారావు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. కాగా మృతుడి కుటుంబానికి కంపెనీ యాజమాన్యం రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు.

29 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కోటవురట్ల, ఫిబ్రవరి 12: మండలంలోని పందూరులో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఇంటిలో తనిఖీలు నిర్వహించి 29 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు. పందూరు గ్రామంలో భీముని రాజుబాబు అనే వ్యక్తి తన ఇంటిల్లో మద్యం నిల్వ చేసి అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడు రాజుబాబును అరెస్టు చేశామన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలిద్దాం

- కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి పిలుపు

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 12: సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనను ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన గిరిజన సంక్షేమ శాఖ రూపొందించిన కరపత్రాలు, పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఎర్ర రక్తకణాల రుగ్మతల మూలంగా వచ్చే రక్తహీనతని తెలిపారు. ఈ వ్యాధి జన్యుపరంగా గిరిజనుల్లో ఎక్కువగా వస్తున్నట్టు నిపుణులు తెలిపారన్నారు. కానీ ఇతర సమూహాల్లో ఈ వ్యాధి లక్షణాలను గుర్తించారన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ, దీని బారినపడిన వారిలో రక్తహీనత, కళ్లు పసుపు రంగుకు మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్లనొప్పులు, ఆలసట మొదలైన లక్షణాలు కనిపిస్తాయన్నారు. సరైన వైద్యం, నియమబద్ధమైన ఆహారపు అలవాట్ల ద్వారా నియంత్రించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ బి.దయానిధి, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ ఎ.మహేశ్, ఏటీడబ్ల్యూఓ నాగశిరీష, డీపీవో ఆర్.శిరీషారాణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, భూసర్వే ఏడీ ఎస్.గోపాలరాజా తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ క్రీడకు జన సమీకరణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

- నేడు 'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు కార్యక్రమం
- హాజరుకానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

'ఆడుదాం..ఆంధ్రా' పేరుతో నిర్వహిస్తున్న పోటీలకు వందల కోట్ల రూపాయలు మంచి నీళ్లలా ఖర్చు చేస్తున్నారు. ఈ పోటీల ముగింపు వేడుక మంగళవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహిస్తున్నారు. దీనికి భారీగా జన సమీకరణ జరుగుతోంది. పోతినమల్లయ్యపాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని (ఏసీఏ-వీడీసీఏ) వేదికగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఇక్కడ కేవలం 500 మందికి బహుమతి ప్రదానం జరగనుండగా ఈ కార్యక్రమం వీక్షించడానికి 25 వేల మందిని తీసుకురావాలని వైసీపీ పెద్దలు టార్గెట్ ఇచ్చారు. ఉత్తరాంధ్రా జిల్లాల నుంచి జనాల తరలింపునకు ఆర్టీసీ నుంచి 585 బస్సులు తీసుకున్నారు. ఇవి కాకుండా ప్రైవేటు విద్యా సంస్థల నుంచి కూడా బలవంతంగా బస్సులు తీసుకున్నారు. విశాఖపట్నంలో ఒక్కో వార్డు నుంచి 350 మందికి తక్కువ కాకుండా తేవాలని లక్ష్యం ఇచ్చారు. ఇందులో భాగంగా ఒక్క జోన్-3 కార్యాలయం పరిధిలో 14 వార్డుల నుంచి ఐదు వేల మంది తరలింపునకు 90 బస్సులు కేటాయించారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, కార్పొరేటర్లకు జన సమీకరణ బాధ్యత అప్పగించారు.

నేడు సీఎం పర్యటన కార్యక్రమం

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం...ఆంధ్ర' ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో మంగళవారం సాయంత్రం 5.20 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 5.45 గంటలకు ఐటీ హిల్-3పై ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో ఆరు గంటలకు పీఎంపాలెం క్రికెట్ స్టేడియానికి వెళతారు. స్టేడియంలో ప్రజలకు అభివాదం చేసిన అనంతరం క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకిస్తారు. మ్యాచ్ ముగిసిన తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రోన్ షో, లైట్ షో వీక్షిస్తారు. అనంతరం అందరినీ ఉద్దేశించి మాట్లాడి, విజేతలకు బహుమతులు అందజేస్తారు. ఆ తరువాత రోడ్డుమార్గంలో రాత్రి 8.05 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, ప్రత్యేక విమానంలో బయలుదేరి విజయవాడ వెళతారు.

ఫైనీర్ కంపెనీకి రైల్వే ట్రాక్ కోసం చకాచకా పనులు


రైల్వే ట్రాక్ వేసేందుకు చేపట్టిన పనులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 12: ఫైనీర్ కంపెనీకి రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు కంపెనీ యాజమాన్యం పనులు వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో మాకవరకపాలెం మండలంశెట్టిపాలెం, జెడ్.గంగవరం, దుంగలవానిపాలెం, రామన్నపాలెం, జి.వెంకటాపురం గ్రామాల మీదుగా ఫైనీర్ కంపెనీ ముడి సరకు నిల్వ ఉండే ప్రదేశం వరకు ట్రాక్ నిర్మాణానికి సర్వే పూర్తి చేసి మార్కింగ్ కూడా చేశారు. అయితే కశింకోట మండలం బయ్యవరం నుంచి నేరుగా కంపెనీ వరకు ఏలేరు కాలువ గట్టు గుండా రైల్వే ట్రాక్ వేసేందుకు ఇప్పటికే ఏలేరు శాఖ అధికారులు, ప్రభుత్వంనుంచి అనుమతులు తీసుకున్నారు. సుమారు 13 కిలో మీటర్లు పొడవున ట్రాక్ వేసేందుకు కంపెనీ యాజమాన్యం ఇప్పటికే అన్ని అనుమతులు తీసుకొని ఏడాది కిందటే ఒక ప్రైవేటు కంపెనీకి బాధ్యతలు అప్పగించింది. అయితే రోడ్డు మార్గం ద్వారా ముడిసరకు కంపెనీకి రావడంతో భారీ బడ్జెట్ అవుతుండడంతో రైల్వే ట్రాక్ ద్వారా సరుకును తెచ్చుకునేందుకు సన్నాహాలు చేసింది. ఈ నేపథ్యంలో నెల రోజుల నుంచి కంపెనీ యాజమాన్యం ఏలేరు కాలువ గట్టుపై ఉన్న మట్టి సరిచేస్తోంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	254.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

బొండపల్లి నుంచి తహసీల్దారును అనుసరించా..

- ఆయనతో మాట్లాడేందుకే అక్కడకు వెళ్లా..
- ఇంటికి వచ్చిన తరువాత కూడా నాతో మాట్లాడేందుకు అంగీకరించలేదు
- అందుకే ఆయన కిందకు వచ్చేంత వరకూ వేచిచూశా
- బెదిరింపు ధోరణిలో మాట్లాడడంతో ఇనుప రాడ్డుతో దాడి చేశా
- ఇక్కడ నుంచి రమణయ్యకు బదిలీ అయిన తరువాత కన్వేయన్స్ డీడ్ జారీ కాదని నిర్ధారణకు వచ్చా
- ఆ తరువాత కలిస్తే కసురుకునేవారు, బెదిరించేవారు
- పోలీస్ విచారణలో నిందితుడు మురారి సుబ్రహ్మణ్యం గంగారావు
- ముగిసిన కస్టడీ
- పలు కీలక విషయాలు వెల్లడించినట్టు ప్రచారం


నిందితుడు గంగారావు (ఫైల్)


మృతుడు రమణయ్య(ఫైల్)

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):

తహసీల్దార్ సనపల రమణయ్యను హత్య చేసిన మురారి సుబ్రహ్మణ్యం గంగారావు నాలుగు రోజుల పోలీస్ కస్టడీ సోమవారం ముగిసింది. కొమ్మాదిలోని ఎస్‌టీబీఎల్ వెనుక అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న తహసీల్దార్‌ను ఈనెల రెండో తేదీ రాత్రి పది గంటల సమయంలో గంగారావు ఇనుపరాడ్‌తో మోది హత్య చేసిన విషయం తెలిసిందే. హత్య చేసిన తర్వాత చెన్నై పారిపోయిన గంగారావును పీఎం పాలెం పోలీసులు ఈనెల నాలుగున అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా...రెండు వారాలు రిమాండ్‌కు ఆదేశించింది. తహసీల్దార్‌ను హత్య చేసింది గంగారావు అయినప్పటికీ వెనుక ఎవరున్నారు?, హత్య చేయాల్సినంత కక్ష రమణయ్యపై ఏముందనే అంశాలపై పోలీసులు దృష్టిసారించడం లేదనే విమర్శలు రావడం, నిందితుడిని కస్టడీకి తీసుకుని విచారించకపోవడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో గంగారావును పది రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కోర్టులో పిటిషన్ వేయగా, ఐదు రోజులకు అనుమతి లభించింది. కోర్టు అనుమతి మేరకు ఈనెల తొమ్మిదిన గంగారావును కస్టడీకి తీసుకున్న పోలీసులు పీఎం పాలెం స్టేషన్‌లో సోమవారం వరకూ విచారించారు. హత్య జరగడానికి మూడు నెలలు ముందు నుంచి గంగారావుకు సంబంధించిన సెల్‌ఫోన్ కాల్‌డేటా (సీడీఆర్)తోపాటు వాట్సాప్ చాటింగ్‌లు, వాట్సాప్ కాల్స్‌కు సంబంధించిన డేటా (ఐపీడీఆర్)ను పోలీసులు సేకరించారు. ఆయా వివరాల ఆధారంగా గంగారావును ప్రశ్నించారు. గంగారావును హత్య చేయాలనుకోలేదని, దాడి చేసి భయభ్రాంతులకు గురిచేయాలనుకున్నానని గంగారావు చెప్పినట్టు తెలిసింది. తాను ఎవరికి కన్వేయన్స్ డీడ్ జారీచేయాలని తహసీల్దార్ రమణయ్యను సంప్రతించానో...వారితో ఈ విషయం చర్చించానని గంగారావు చెప్పినట్టు సమాచారం. తాను దాడి చేస్తానని చెప్పినప్పుడు అవతలివారు ఎవరూ 'అలాంటి పని వద్దని చెప్పలేదని' స్పష్టంచేసినట్టు తెలిసింది. అలాగే తనకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై కూడా గంగారావు మొదట్లో తటపటాయించినా, తర్వాత మొత్తం పూసగుచ్చినట్టు పోలీసులకు వెల్లడించినట్టు సమాచారం. తహసీల్దార్ రమణయ్య విజయనగరం జిల్లా బదిలీ అయిన తర్వాత ఇక తన పని జరగదని నిర్ధారించుకున్నానని, దీనిపై మాట్లాడేందుకు ఆయన్ను కలిస్తే...తనను కసరడం, బెదిరించడంతోపాటు కలవొద్దని కరాఖండిగా చెప్పేవారని గంగారావు పోలీసులకు వివరించినట్టు తెలిసింది. బొండపల్లిలో రమణయ్య బాధ్యతలు స్వీకరించినప్పుడు తాను కూడా వెళ్లానని అక్కడ తాను కలిసేందుకు యత్నించినా, ఆయన అంగీకరించలేదని, రాత్రి వరకూ అక్కడే ఉండి, రమణయ్య ఇంటికి బయలుదేరినప్పుడు కారును అనుసరించినట్టు గంగారావు పోలీసులకు తెలిపాడు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా రమణయ్య తనతో మాట్లాడకుండా వెళ్లిపోవడంతో, ఆయన కిందికి వచ్చేంత వరకూ వేచిచూశానని, రాత్రి పది గంటల సమయంలో ఇంటికి వచ్చిన ఇద్దరిని సాగనంపేందుకు ఆయన కిందకు రావడంతో మాట్లాడానని, అప్పుడు కూడా బెదిరింపు ధోరణిలో మాట్లాడడంతో వెంట తీసుకువెళ్లిన రాడ్డుతో తలపై కొట్టినట్టు గంగారావు చెప్పాడు. తర్వాత తాను ద్విచక్ర వాహనంపై తన ఇంటికి వెళ్లగా, అక్కడి నుంచి ఎయిర్‌పోర్టుకు వేరొకరు డ్రాప్ చేసినట్టు గంగారావు పోలీసులకు వెల్లడించినట్టు సమాచారం. ఇదిలావుండగా ఈ కేసులో గంగారావును మాత్రమే నిందితుడిగా చూపించి దర్యాప్తు ముగించేయాలంటూ అధికార పార్టీకి చెందిన ఉన్నతస్థాయి నేతల నుంచి పోలీసులపై ఒత్తిళ్లు వస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందువల్లే కస్టడీలో వెల్లడించిన అంశాలను పోలీసులు ఇంతవరకూ బయటపెట్టకుండా గోప్యత పాటిస్తున్నారని అంటున్నారు.

వైసీపీ నేత మట్టి మేత

- ఎస్.ఆర్.పురంలో అనధికార తవ్వకం
- గతంలో జేసీబీ, వాహనాలను పట్టుకుని అధికారులకు అప్పగించిన మండలాధ్యక్షురాలు
- అయినా స్పందించని అధికారులు


కొండను గుల్ల చేసిన దృశ్యం

పెందుర్తి, ఫిబ్రవరి 12: మండలంలోని ఎస్.ఆర్.పురంలో అధికార పార్టీకి చెందిన నేత ఒకరు అడ్డగోలుగా కొండను తవ్వి రాయి, మట్టి అమ్ముకుంటున్నారు. అనధికారికంగా సాగుతున్న గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్వయంగా అధికార పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. ఎస్.ఆర్.పురం సర్వే నంబర్‌లో 100లో గల కొండ వద్ద స్థానిక వైసీపీ నేత జిన్నాల జయరాజ్ ఆధ్వర్యంలో తవ్వకాలు సాగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన నేత కావడంతో ఏ అధికారీ ఆపే సాహసం చేయడం లేదు. కొంతకాలం కిందట ఎంపీపీ ముధుపాడ నాగమణి స్వయంగా ఆ క్వారీలో రాయిని తవ్వుతున్న జేసీబీని, లారీని పట్టుకుని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు వాహనాలు సీజ్ చేశారు. క్వారీ విషయమై నేతల మధ్య ఘర్షణ ఏర్పడడంతో స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ వద్ద పంచాయితీ జరిగినట్టు ప్రచారం జరిగింది. ఆ తరువాత కొంతకాలం తవ్వకాలు ఆగిపోయాయి. ఇటీవల మళ్లీ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఎంపీపీ భర్త అంజి, తదితరులు సోమవారం క్వారీ వద్దకు వెళ్లి పరిశీలించారు. అధిక సంఖ్యలో లారీలు, డంపర్లతో గ్రావెల్, రాయిని తరలించుకుపోతున్నారని గుర్తించారు. జయరాజ్ మైనింగ్ మాఫియా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గ్రావెల్ లారీలు పట్టుకుని అధికారులకు అప్పగించినా చర్యలు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి క్వారీలో తవ్వకాలను అడ్డుకోవాలన్నారు. మరో నేత మాట్లాడుతూ అక్రమ తవ్వకాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు.

ఆడుదాం ఆంధ్రలో అదే రచ్చ

- అనకాపల్లి కబడ్డీ జట్టును డిస్ క్వాలిఫై చేస్తున్నట్టు ప్రకటించిన అధికారులు
- విశాఖ-కర్నూలు జట్ల మధ్య నిర్వహించ తలపెట్టిన మ్యాచ్‌ను అడ్డుకుంటూ మైదానంలో అనకాపల్లి ఆటగాళ్ల నిరసన
- మ్యాచ్ ఆడించేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమణ


కోర్టులో కూర్చుని నిరసన తెలియజేస్తున్న అనకాపల్లి జిల్లా క్రీడాకారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం...ఆంధ్ర' క్రీడా పోటీల్లో సోమవారం కూడా గొడవ జరిగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఆదివారం అనకాపల్లి, విశాఖ జిల్లాల జట్ల మధ్య జరగాల్సిన కబడ్డీ మ్యాచ్ హైడ్రామా మధ్య వాయిదా పడిన విషయం తెలిసిందే. విశాఖ జిల్లా జట్టులో కొత్తగా చేరిన ఆటగాడిని అధికారులు గుర్తించి పక్కనపెట్టాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. సోమవారం ఉదయం ఇరు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహిస్తామని చెప్పారు. కానీ, అనూహ్యంగా సోమవారం మధ్యాహ్నం వరకు మ్యాచ్ నిర్వహించకపోగా, అనకాపల్లి జట్టును డిస్ క్వాలిఫ్ చేస్తున్నట్టు ప్రకటించారు. విశాఖ జట్టుకు కర్నూలు జిల్లా జట్టుతో మ్యాచ్ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇరు జట్లు ఆడేందుకు గ్రౌండ్‌లో దిగే సమయంలో అనకాపల్లి జట్టు సభ్యులు మైదానంలో కూర్చుని నిరసన తెలిపారు. తమకు న్యాయం చేసేంత వరకు గ్రౌండ్ వదిలి వెళ్లబోమని స్పష్టం చేశారు. 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. సుమారు గంటపాటు మైదానంలోనే కూర్చోవడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. సమస్యను పెద్దది చేయకుండా అనకాపల్లి జట్టును మ్యాచ్ ఆడించాలంటూ ఆదేశాలు రావడంతో శాప్ అధికారులు, ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న విజయనగరం జిల్లా డీఎస్‌డీవో అనకాపల్లి, విశాఖ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహిస్తున్నామంటూ ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని విశాఖ జట్టు ఆటగాళ్లు తీవ్రంగా వ్యతిరేకించారు. అర్హత లేదని ప్రకటించిన జట్టుతో ఎలా ఆడతామని ఆందోళన నిర్వహించారు. వారితో శాప్, క్రీడా శాఖకు చెందిన అధికారులు మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎట్టకేలకు విశాఖ, అనకాపల్లి జట్ల మధ్య నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో విశాఖ జిల్లా జట్టు విజయం సాధించింది. ఆట సమయంలో అనకాపల్లి జట్టు కెప్టెన్‌కు గాయం కావడంతో కొంతసేపు ఆటకు అంతరాయం ఏర్పడింది.

గౌరీపరమేశ్వరులకు సారె సమర్పణ


ఊరేగింపుగా సారెను తీసుకువెళుతున్న భక్తులు

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 12: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల 10న ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక సర్పంచ్ గజాల సూరిబాబు, నాగరత్నం దంపతుల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున విద్యుత్ దీపాలతో అలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజున సోమవారం మహిళలు వివిధ రకాల పిండి వంటలను ఇళ్లల్లో తయారు చేసి గౌరీపరమేశ్వరులకు సారెను సమర్పించారు. పురవీధుల్లో గౌరీపరమేశ్వరుల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

రాష్ట్రస్థాయి బాలురు హాకీ టోర్నీ రన్నరప్‌గా జిల్లా జట్టు


రన్నరప్ ట్రోఫీని అందుకుంటున్న అనకాపల్లి జిల్లా బాలుర హాకీ జట్టు

ఎలమంచిలి, ఫిబ్రవరి 12: కర్నూలులో నిర్వహించిన 13వ అంతర్ జిల్లా సబ్ జూనియర్స్ బాలుర హాకీ టోర్నీలో అనకాపల్లి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచినట్టు జిల్లా హాకీ అడహక్ కమిటీ వైస్ చైర్మన్ కొరారు నరేశ్ తెలిపారు. ఈ నెల 10వ తేదీన ప్రారంభమైన పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయని, ఫైనల్ పోటీలో అనకాపల్లి జట్టు, కడప జట్టు చేతిలో 1-2 గోల్స్ తేడాతో ఓడిందని చెప్పారు.

గ్రావెల్ తవ్వకాలపై విచారణ జరిపించాలి

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను అరెస్టు చేసి, సస్పెండ్ చేయాలి

మాజీ మంత్రి బండారు డిమాండ్


గ్రావెల్ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నాయకులు

పరవాడ, ఫిబ్రవరి 12: పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై తక్షణమే విచారణ జరిపించాలని, ఇందులో ప్రధానపాత్ర పోషించిన ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను సస్పెండ్ చేయాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం గ్రావెల్ తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని టీడీపీ శ్రేణులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అండదండలతో పరవాడ ప్రాంతంలో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఏపీ ట్రాన్స్‌కో నుంచి, గ్రావెల్ తవ్వకాలకు మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని, కానీ ఇవేమీ లేకుండా గ్రావెల్ తవ్వి, తరలించుకుపోవడానికి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు కుమ్మక్కయారని బండారు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి ఏపీఐఐసీ అధికారిని అరెస్టు చేసి ప్రాసిక్యూట్ చేయాలని, పోలీసులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్, డంపర్ లారీలను కోర్టు ముందు ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

వంద ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలు రంగం సిద్ధం

దేశపాత్రునిపాలెం రెవెన్యూ పరిధిలో సుమారు వంద ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలు జరిపేందుకు వైసీపీ నాయకులు రంగం సిద్ధం చేశారని, బండారు ఆరోపించారు. ఈ వ్యవహారంలో జిల్లాకు చెందిన ఓ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రధానపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఇక్కడ గ్రావెల్ తవ్వకాలకు కలెక్టర్ తాత్కాలిక అనుమతులు ఇచ్చినట్టు తమ దృష్టికి వచ్చిందని, ఎట్టి పరిస్థితుల్లో గ్రావెల్ తవ్వకాలు జరిపేందుకు వీల్లేదని, కలెక్టర్ అనుమతులు ఇచ్చివుంటే తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, తిక్కవానిపాలెం ఎంపీటీసీ సభ్యుడు సూరాడ బంగార్రాజు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

21న లోకేశ్ శంఖారావాన్ని విజయవంతం చేయాలి


- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వి.అనిత


మాట్లాడుతున్న వి.అనిత

నక్కపల్లి, ఫిబ్రవరి 12: ఈనెల 21వ తేదీన పాయకరావుపేట నియోజకవర్గంలో నిర్వహించనున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఏపీలో ప్రజలు మోసపోయి నాలుగేళ్ల తొమ్మిది నెలలు అయ్యిందని, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ వర్గ ప్రజలు కూడా ఆనందంగా లేరన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్రానికి అవసరమని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ చేపట్టడం జరిగిందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న లోకేశ్ శంఖారావం కార్యక్రమం విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లాలం కాశీనాయుడు, కొప్పిశెట్టి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై సత్వరమే స్పందించాలి

- అధికారులకు కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశం


అర్జీదారుని సమస్య ఆలకిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 12: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి ప్రజలు 365 అర్జీలను అందజేశారు. వీటిని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, డీఆర్వో దయానిధి స్వీకరించారు. పలువురి సమస్యలను కలెక్టర్ స్వయంగా ఆలకించారు. అనంతరం అర్జీలను ఆయా శాఖల అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో వచ్చే అర్జీల్లో భూసమస్యలు, రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించినవి అధికంగా వుంటున్నాయని, సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి దృష్టి సారించాలన్నారు.


అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లిరూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీలను సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అర్జీలపై తీసుకున్న చర్యలు గురించి నిర్ణీత సమయంలో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో మొత్తం 36 అర్జీలు అందగా వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటికి సంబంధించినవి అధికంగా వున్నాయి.

'పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయండి'

తుమ్మపాల, ఫిబ్రవరి 12 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ కోరారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి, ఆయన మాట్లాడారు. రైతుల భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్స్‌గా మార్చడం కార్మికుల హక్కులు కాలరాయడమేనన్నారు. దేశవ్యాప్తంగా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, యువతను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జీఎస్‌జే అచ్యుతరావు, జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, నాయకులు కె.సత్యాంజనేయ, పెంటకోట సత్యనారాయణ, జి.ఏసుదాసు, కోన లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్లే.. పార్కింగ్ స్థలాలు

- మునిసిపాలిటీలో కానరాని అధికార పార్కింగ్ ప్రదేశాలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టని మునిసిపల్ అధికారులు, పాలకులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 12: ఎలమంచిలి మునిసిపాలిటీలో సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పట్టణంలో జనాభాతో పాటు వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పరిశ్రమల ఆఫీసులు ఉన్నాయి. పట్టణంలో పనుల కోసం వచ్చే మండల వాసులు, ఇతర ప్రాంతాల వారు వాహనాలను నిలిపేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో అధికారిక పార్కింగ్ స్థలాలు లేవు. పట్టణానికి వచ్చినవారు తమ ద్విచక్ర వాహనం, జీపు, కారు పార్కింగ్ చేసుకోవాలంటే స్థలాలు లేవు. దీంతో వారు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలో ప్రధానంగా భవనం వీధి, దిమిలి రోడ్డు జంక్షన్, ప్రభుత్వ ఆస్పత్రి జంక్షన్, సైతారుపేట రోడ్డు జంక్షన్, బస్టాండ్ జంక్షన్‌లు నిత్యం వినియోగదారులు, కొనుగోలుదారులతో రద్దీగా ఉంటాయి. మార్కెట్, చికెన్, మటన్ సెంటర్లకు వచ్చేవారు తమ ద్విచక్ర వాహనాలను రోడ్లపైనే నిలిపేస్తున్నారు. పట్టణంలోని సర్వీసు రోడ్లపైనే ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలను సైతం పార్కింగ్ చేస్తుండడంతో పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టిన సమయంలో రద్దీ పెరిగిపోయి వాహనదారులతోపాటు పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే సమయంలో కొందరు యువత, మైనర్లు అతి వేగంతో ద్విచక్ర వాహనాలను నడుపుతుండడంతో చూపరులను ఆందోళన కలిగించేలా ఉంటుంది. మునిసిపల్, పోలీసు అధికారులు సమన్వయంతో పట్టణంలో అధికారిక పార్కింగ్ స్థలాలు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.


రైల్వే స్టేషన్ రోడ్డులో నిలిపివేసిన వాహనాలు


భవనం వీధి రోడ్డుకు ఇరుపక్కలా నిలిపివేసిన వాహనాలు

ప్రారంభించకుండానే శిథిలావస్థకు రాంబిల్లి బస్‌స్టేషన్

- ప్రజాధనం వృథా..
- పట్టించుకోని అధికారులు, పాలకులు


రాంబిల్లిలో శిథిలావస్థకు చేరువైన బస్‌స్టేషన్

రాంబిల్లి, ఫిబ్రవరి 12 మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌స్టేషన్ ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకుంది. అయినా సంబంధిత అధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకోవడం లేదు. బస్‌స్టేషన్ శ్లాబ్, గోడల పెచ్చులు ఊడిపోవడంతోపాటు ఇనుప ఊసలు బయటకు కనిపిస్తున్నాయి. రెండు షాపులుతోపాటు గచ్చు కూడా పూర్తిగా దెబ్బతింది. శిథిలావస్థలో ఉన్న ఈ బస్‌స్టేషన్ వద్దకు ప్రయాణికులు ఎవరూ రావడం లేదు. ప్రయాణికుల సంచారం లేని చోట బస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం వలన ప్రజాధనం వృథా అయ్యిందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న బస్‌స్టేషన్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

గ్యాస్ మూర్తి కుటుంబాన్ని పరామర్శించిన కొణతాల


మూర్తి కుటుంబీకులతో మాట్లాడుతున్న కొణతాల

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 12 : ఇటీవల మృతి చెందిన గ్యాస్ డీలర్ బోగాది రాధాకృష్ణమూర్తి కుటుంబసభ్యులను సోమవారం మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పరామర్శించారు. నరసింగరావుపేటలోని వారి స్వగృహానికి కొణతాల వెళ్లి మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పలకా రాము, వెంపరాల శర్మ, యడ్ల త్రినాథ్, తాడి చక్రవర్తిలు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

పరవాడ, ఫిబ్రవరి 12: పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిపిన వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి వి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రావెల్ తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని సోమవారం వారు పరిశీలించారు. ఏపీఐఐసీ జడ్‌ఎం, మంత్రి అమర్‌నాథ్ అక్రమ తవ్వకాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని వారు ఆరోపించారు. తవ్వకాలు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

నేడు నేవీ నిర్వాసితులకు ప్యాకేజీ పంపిణీ

రాంబిల్లి, ఫిబ్రవరి 12 : మండలంలోని వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లోని నేవీ నిర్వాసిత మత్స్యకారులకు ప్రభుత్వం మంజూరు చేసిన జీవనభృతి ప్యాకేజీ చెక్కులను మంగళవారం వాడనర్సాపురంలో ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు పంపిణీ చేస్తారని వాడనర్సాపురం, కొత్తపట్నం సర్పంచులు కారే రామారావు, చోడిపల్లి పార్వతి, మాజీ కోఆప్షన్ సభ్యులు కొవిరి రామకృష్ణ, కొత్తపట్నం నాయకుడు చోడిపల్లి వెంకటేశ్వరులు తెలిపారు.. ఈ రెండు గ్రామాలకు చెందిన 2,211 మందికి జీవనభృతి చెక్కులను అందజేస్తారన్నారు. ఒక్కొక్కరికి రూ.1.3లక్షలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

షెడ్యూల్ కులాల వర్గీకరణకు సహకరించాలి

సబ్బవరం, ఫిబ్రవరి 12 : షెడ్యూల్ కులాల వర్గీకరణకు రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు సామ్రాట్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని సాయినగర్‌లో సోమవారం ఎంఆర్‌పీఎస్ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ ఇందుగబిల్లి గోపి ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశం చివరి దశకు చేరుకుందన్నారు. ఈ సమయంలో రాజకీయ పార్టీలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య ముఖ్య సలహాదారు దువ్వ దుర్గా, మండల నేతలు బొర్రా జయరాజు, నీటిపల్లి గౌరీ, బాకడబుడి కోటి, ఈతలపాక పోలయ్య, నారాయణమూర్తి, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రశాంతిలో ఉచిత కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 12: తమ ఐటీఐలో చెన్నై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రశాంతి ఐటీఐ ప్రిన్సిపాల్ లాలం వెంకటరావు తెలిపారు. సర్టిఫికెట్ డాటా ఎంట్రీ, ఆఫీస్ అసిస్టెంట్, సర్టిఫికెట్ కంప్యూటర్ అప్లికేషన్ అకౌంటింగ్, పబ్లిషింగ్, పబ్లిషింగ్ అకౌంట్, ఐటీ 0 లెవెల్, ఒక్కొక్క కోర్సులకు శిక్షణ ఇస్తామన్నారు. ఎస్సీ 12, ఎస్టీ 12, ఈడబ్ల్యూఎస్ 6 సీట్లు ఉన్నాయన్నారు. పదవ తరగతి పాసయి 18 ఏళ్లు నిండిన వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

డ్రగ్ మార్కెటింగ్‌పై విద్యార్థులకు అవగాహన


'సిస్టోపిక్' ప్రతినిధికి జ్ఞాపిక అందజేస్తున్న విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, ఫిబ్రవరి 12: ప్రముఖ మందుల పరిశ్రమ సిస్టోపిక్ లేబరేటరీస్ ప్రతినిధులు సోమవారం స్థానిక స్పెస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(కెమిస్ట్రీ) విద్యార్థులకు డ్రగ్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కంపెనీ జోనల్ మేనేజరు(సేల్స్) ఎం.వెంకటరమణ పాల్గొని కెమిస్ట్రీ విద్యార్థులకు ఫార్మాస్యూటికల్ సేల్స్ అండ్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడంతోపాటు ఉద్యోగావకాశాలపై వివరించారు. అనంతరం ఆయనకు శ్రీప్రకాశ్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని పనులపై విచారణ జరపాలి

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని వెంకటనగరం పంచాయతీలో డీపీఓ అనుమతుల్లేకుండా, వార్డు సభ్యులకు సమాచారం లేకుండా జరుగుతున్న పనులపై విచారణ చేపట్టాలని గ్రామానికి చెందిన ఏపీ మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం పలువురు పంచాయతీ వార్డు సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రాన్ని అందజేశామని ఆయన తెలిపారు.

ఘనంగా రజకుల బళ్లల పండుగ

కశింకోట, ఫిబ్రవరి 12 : స్థానిక గవరపేట వీధిలో రజకులు బళ్లల పండుగ సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఊరేగింపుగా గ్రామ వీధుల గుండా పెదగుమ్మం వరకు వెళ్లి అక్కడున్న బళ్లలకు పూజలు చేశారు. రోజంతా రజకులందరూ ఆనందంగా గడిపారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

అచ్యుతాపురం, ఫిబ్రవరి 12: విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద నిర్వహిస్తున్నామని ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో వినియోగదారులందరూ సమస్యలను తెలియజేయాలన్నారు.

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు పునర్నిర్మించాలి

అనకాపల్లి, మునగపాక, అచ్యుతాపురాల్లో రాస్తారోకోలు.. పాలకులు స్పందించకుంటే నిరవధికంగా నిర్బంధం : ఆందోళనకారులు


అచ్యుతాపురం జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న దృశ్యం


మునగపాకలో మాట్లాడుతున్న లోకనాథం


అనకాపల్లి బైపాస్‌లో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 12: అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు పునర్నిర్మించాలంటూ రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అచ్యుతాపురం జంక్షన్, కొండకర్ల, హరిపాలెం, తిమ్మరాజుపేట జంక్షన్‌లలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వందలాది వాహనాలు ఈరోడ్డు గుండా ప్రయాణం చేయడం వల్ల పూర్తిగా పాడైందన్నారు. ఈ కార్యక్రమంలో రామసదాశివరావు, బుద్ద రంగారావు, కర్రి అప్పారావు, రొంగలి రాము, కె.సోమునాయుడు, చొప్పారమణ, పుర్రే రాజు, చిన్నారావు, చండి అప్పారావు, కన్నుం నాయుడు, పరదేశి నాయుడు పాల్గొన్నారు.

పాలకులు స్పందించకుంటే నిరవధిక నిర్బంధం

మునగపాక: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు గురించి పాలకులు ఇంకా స్పందించకుంటే నిరవధిక నిర్బంధ కార్యక్రమానికి శ్రీకారం చుడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం హెచ్చరించారు. సోమవారం అనకాపల్లి బైపాస్ జంక్షన్ నుంచి అచ్యుతాపురం వరకూ నాగులాపల్లి, ఒంపోలు, తిమ్మరాజుపేట, మునగపాక గ్రామాలలో జరిగిన మానవహారంలో సీపీఎం, తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు రైతులు ముందుకు వచ్చినా పరిహారం ఇచ్చుకోలేక ప్రభుత్వం సాకులు చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఈ రోడ్డుపై పాలకులు, అధికారులు తక్షణం స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గంటా శ్రీరామ్, టీడీపీ నాయకులు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, దాడి శివ, ఆడారి కన్నబాబు, లక్ష్మణరావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, బ్రహ్మాజీ, శ్రీనివాసరావు, ఆడారి మహేష్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ జంక్షన్‌లో రాస్తారోకో

అనకాపల్లి టౌన్: అనకాపల్లి-అచ్యుతాపురం రహదారిని పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు బైపాస్ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి, రాస్తారోకో నిర్వహించారు. దీనిని డబుల్ రోడ్డుగా పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఈ రహదారి పదేళ్లుగా కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో గోతులమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శివాజీ, రాము, చలపతి, అప్పారావు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసగించేందుకే డీఎస్సీ నోటిఫికేషన్

- మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, ఫిబ్రవరి 12 : రాష్ట్రంలో నిరుద్యోగులను మోసగించేందుకే ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు పలు అంశాలతో కూడిన లేఖను గవర్నర్‌కు రాసినట్టు సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చెప్పారు. నాలుగున్నరేళ్లుగా విడుదల చేయని డీఎస్సీ నోటిఫికేషన్ ఎన్నికల ముందు విడుదల చేయడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కేవలం ఎన్నికల స్టంటేనని స్పష్టం చేశారు.


గవర్నర్‌కు రాసిన లేఖను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

అలాగే గవర్నర్‌కు రాసిన లేఖలో డీఎస్సీ, టెట్ అభ్యర్థుల అర్హత వయసు 47 ఏళ్లకు పెంచాలని కోరానన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 18,520 టీచర్ పోస్టులను భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. అలాగే టెట్, డీఎస్సీ పరీక్షలకు ఒకే సిలబస్ ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం మూడు వేర్వేరు సిలబస్‌లను పెట్టడం అన్యాయమన్నారు. ప్రస్తుతం 40 శాతం పోస్టులు మాత్రమే భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. ఈ అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి నిరుద్యోగులకు న్యాయం చేయాలని గవర్నర్‌కు రాసిన లేఖలో కోరినట్టు పీలా గోవింద వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చికూర రాము, కర్రి బాబి, సేనాపతి స్వరూప, ముత్వల సూర్య, ఆళ్ల జగన్ పాల్గొన్నారు.

పీవీ ఆర్థిక సంస్కరణలు శ్లాఘనీయం

- ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు

ఎలమంచిలి, ఫిబ్రవరి 12 : భారతరత్న మాజీ ప్రధాని పీవీ. నరసింహారావు ఆర్థిక సంస్కరణలు, పాలనా తీరు శ్లాఘనీయమని ఎమ్మెల్యే యూవీ రమణ మూర్తిరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని పీవీ కాంప్లెక్సు వద్ద ఉన్న పీవీ విగ్రహానికి ఎమ్మెల్యే రమణ మూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయత్రి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలంతా పీవీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, సచివాలయ కన్వీనర్ కర్రి శివ, నేతలు యల్లపు నాగరాజు, పిల్లా త్రినాథ్, మల్ల కొండబాబు, బీబీ, గాయత్రీ సేవా ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.సోమేశ్వరరావు, పెద్దింటి సూర్యనారాయణమూర్తి, రాచకొండ పట్టాభిరామయ్య పాల్గొన్నారు.

22న ఎలమంచిలి ఫ్లై ఓవర్ ప్రారంభం

ఎలమంచిలి నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి రాజు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎలమంచిలి ఫ్లైఓవర్ ఈనెల 22వ తేదీన మంత్రి చేతుల మీదుగా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం రోడ్డు టెండర్ల ప్రక్రియ దాటి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. యాతకొత్తపట్నం, నర్సాపురం మత్స్యకారులకు జీవనభృతి ప్యాకేజీకి రూ.30 కోట్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, వైసీపీ నేతలు కొల్లి త్రినాథ్, కర్రి శివ, పిల్లా త్రినాథ్ పాల్గొన్నారు.


ఎలమంచిలిలో భారతరత్న పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీపీ గోవింద్

'రీసర్వే పేరుతో భూములు అన్యాక్రాంతం'

నక్కపల్లి, ఫిబ్రవరి 12 : మండలంలోని జి.జగన్నాథపురంలో రీసర్వే పేరుతో భూస్వాములకు పేదల భూములు అన్యాక్రాంతం చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ఆరోపించారు. సోమవారం గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జి.జగన్నాథపురం గ్రామంలోని సర్వే నం.149,150,151,152లలోని నానేపల్లి సత్యనారాయణ మరికొంతమంది రైతులు పాస్‌పుస్తకాలు ఉన్నాయని, సొంత భూముల్లో ఇప్పటికి వరకు వారే సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే రీసర్వేలో భూ సరిహద్దుల చట్టం ప్రకారం రైతుల పేరిట నోటీసులు అందజేశారన్నారు. ఆన్‌లైన్‌లో మాత్రం పేదల భూముల పక్కన కాకినాడకు చెందిన ఒక భూస్వామికి 30 ఎకరాలు ఉండడంతో ఆయన పేరిట ఎకరం, అర ఎకరం ఉన్న రైతులు భూములు వారి పేరిట రికార్డులు నమోదు చేశారన్నారు. పేదల భూములు పెత్తందారుల సొత్తుగా ఈ ప్రభుత్వంలో మారిందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు రికార్డులు పరిశీలించి పేద రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నానేపల్లి రాఘవ, మారిశెట్టి నానాజీ, అమలాపురం సర్పంచ్ శంకర్రావు, పక్కుర్తి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొప్పిశెట్టి వెంకటేశ్

తుక్కుగా చెత్త వాహనాలు

... 5వ పేజీ తరువాయి

వినియోగంలో వున్నాయి. ఇంచుమించు ఏడాది కాలంగా ఇదే పరిస్థితి. ఆటోల బ్యాటరీలకు చార్జింగ్ పెట్టడం లేదు. ఇవీ కూడా తుప్పు పట్టి పనికిరాకుండా పోయే పరిస్థితి నెలకొంది.

అద్దె ట్రాక్టర్లకు ఏటా రూ.60 లక్షలు చెల్లింపు

మునిసిపాలిటీకి చెందిన చెత్త తరలింపు వాహనాలు ఒక్కొక్కటిగా మూలకు చేరుతుండడంతో అధికారులు వాటి స్థానంలో ప్రైవేటుగా అద్దె ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో అద్దె ట్రాక్టర్లకు రూ.60 లక్షలు చెల్లించనున్నట్టు అంచనా వేశారు. ఒక్కో ట్రాక్టర్ ఖరీదు రూ. 10 లక్షలు వుంటుంది. మూడేళ్ల నుంచి అద్దె ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఈ డబ్బులతో మునిసిపాలిటీకి చెందిన వాహనాలకు మరమ్మతులు చేయించవచ్చు, మిగిలిన డబ్బులతో కొత్త వాహనాలు కొనుగోలు చేయవచ్చు. కానీ మునిసిపల్ అధికారులు, పాలకులు ఆ దిశగా ఎందుకు ఆలోచించడంలేదని ప్రజలు టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో పలుమార్లు ప్రశ్నించారు. కాగా చెత్త తరలించే వాహనాలు మూలకు చేరడం, వాటిని బాగు చేయించకపోవడంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును వివరణ కోరగా, పాడైన వాహనాలకు మరమ్మతుల చేయించాలని ఇంజనీరింగ్ అధికారులకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

హైవే భూముల్లో గ్రావెల్ దందా

... 5వ పేజీ తరువాయి

రూ.3-4 వేలు, డంపర్ అయితే రూ.5-6 వేలు తీసుకుంటున్నారు. కాగా గతంలో రోడ్డు నిర్మాణ సంస్థ, ప్రభుత్వం సేకరించిన భూముల్లో అక్కడక్కడా వున్న గోతులను ఫ్లైయాష్‌తో పూడ్చారు. అక్రమార్కులు దీనికి కూడా వదిలిపెట్టకుండా తరలించుకు పోతున్నారు. సూరెడ్డిపాలెంలో జాతీయరహదారి రింగు రోడ్డు కోసం సేకరించిన భూముల్లో కొంతకాలం నుంచి గ్రావెల్, మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ విజిలెన్స్, మైన్స్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి మట్టి, గ్రావెల్ సరిపడ లభించక, పరవాడలోని సింహాద్రి ఎన్టీపీసీ పవర్ ప్లాంట్ నుంచి ఫ్లైయాష్‌ను తీసుకువచ్చి వినియోగిస్తున్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎన్‌హెచ్‌ఏఐ భూముల్లో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

'పేట' వైసీపీలో అసమ్మతి గళం

... 5వ పేజీ తరువాయి

జరగడంతో అమ్మాజీ తీవ్రఅసంతృప్తికి గురైనట్టు తెలిసింది. కాగా నిరసన ర్యాలీ సందర్భంగా కొంతమందిని 'ఆంధ్రజ్యోతి' పలుకరించగా, స్థానికురాలైన పెదపాటి అమ్మాజీకి కాకుండా వేరే జిల్లాకు చెందిన జోగులను సమన్వయకర్తగా నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అమ్మాజీకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జీపు బోల్తా : ఇద్దరు గిరిజనుల మృతి

- మరో 11 మందికి గాయాలు


బోల్తాపడిన సర్వీస్ జీపు

చింతపల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని అన్నవరం పంచాయతీ సంపంగిపుట్టు వద్ద ఓ జీపు అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరు గిరిజనులు మృతిచెందారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు లోతుగెడ్డ పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కుడుముసారి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల గిరిజనులు సోమవారం అన్నవరం వారపు సంతకు వచ్చారు. సంతలో అవసరమైన సరకులు కొనుగోలు చేసుకుని సాయంత్రం స్వగ్రామాలకు సర్వీసు జీపులో తిరుగు ప్రయాణమయ్యారు. అన్నవరం నుంచి 12 మంది గిరిజనులతో తమ్మంగుల బయలుదేరిన జీపు సంపంగిపుట్టు బ్రిడ్జి మలుపు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మెరకలు గ్రామానికి చెందిన జర్త చిన్నమ్మ (60) అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన మిగిలిన వారిని 108లో లోతుగెడ్డ పీహెచ్‌సీకి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మెరకలు గ్రామానికి చెందిన వంతల అప్పారావు (55) మృతిచెందారు. క్షతగాత్రులకు కాళ్లు, చేతులు విరిగిపోయాయి. కొంతమందికి తల, ఛాతీ భాగాల్లో బలమైన గాయాలయ్యాయి. గాయపడిన వారికి లోతుగెడ్డ, కోరుకొండ పీహెచ్‌సీల వైద్యాధికారులు లక్ష్మీకాంత్, ఎల్.శివప్రసాద్ ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం పీహెచ్‌సీ అంబులెన్స్, 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

టీడీపీ హయాంలో బీసీలకు పెద్దపీట

- మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు


సమావేశంలో మాట్లాడుతున్న పప్పల చలపతిరావు

ఎలమంచిలి, ఫిబ్రవరి 12: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు పెద్దపీట వేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు అధ్యక్షతన జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రజారంజక పాలన అందించిన పార్టీ టీడీపీ మాత్రమేనన్నారు. రంగనాయకులు, జిల్లా నేతలు కాండ్రకోట చిరంజీవి, రాజాన సూర్యానాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో బీసీలకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు బొండా జగన్నాథరావు, బీసీ నేతలు భీమరశెట్టి శ్రీను, బత్తుల లక్ష్మి, గుర్రం నూకరాజు, రైతు నేతలు కొఠారు సాంబ పాల్గొన్నారు.

మరిడిమాంబని దర్శించుకున్న టీడీపీ నేతలు


అయ్యన్న, పీలా, రత్నాకర్‌లను సత్కరించిన ఆలయ కమిటీ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 12 : స్థానిక విజయరామరాజుపేటలోని మరిడిమాంబ అమ్మవారిని ఆదివారం రాత్రి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పెద్దలు వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వారితో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ గండిపేట స్కూల్‌లో దాడి వీరభద్రరావు, కేసీఆర్ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరించిన కలెక్టర్


డైరీని ఆవిష్కరించిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 12: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్-2024 సంవత్సరం డైరీని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తన చాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. తర్వాత ఆయన చేతుల మీదుగా అందరికీ డైరీలు అందజేశారు. అనంతరం జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాన్ని ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు కలెక్టర్‌కు అందజేశారు. అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా యాజమాన్య గుర్తింపు కార్డులతో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని యూనియన్ నాయకులు కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, త్వరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దాల రాంబాబు, జిల్లా అధ్యక్షుడు పెంటకోట జోగినాయుడు, ప్రధానకార్యదర్శి కోరాడ చంద్రరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటఅప్పారావు, అనకాపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొయిలాడ శేఖర్, డీపీఆర్‌వో సాయిబాబా పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

పరవాడ, ఫిబ్రవరి 12: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు సూచించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సీఐ పలు సలహాలు, సూచనలు చేశారు.మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. ఇదే విషయమై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు సీఐ చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లేశ్వరరావు, హెచ్ఎం అప్పలనాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

సబ్బవరం, ఫిబ్రవరి 12 : విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో-1,2 లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి సూచించారు. మండలంలోని మలునాయుడుపాలెం జడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఎల్ఐపీ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్)బృందం పర్యటించింది. కార్యక్రమంలో హెచ్ఎం జగదీష్, రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.

ధర్మవరం అగ్రహారంలో 301 మందికి నేత్ర పరీక్షలు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 12: మండలంలోని ధర్మవరం అగ్రహారంలో సోమవారం అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా కంటి వైద్య శిబిరంలో వైద్యులు 301 మందికి పరీక్షలు జరిపారు. వీరిలో 27 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరందరికీ పాయకరావుపేట హైమ నేత్రాలయంలో ఆపరేషన్లు నిర్వహిస్తామని ఫౌండేషన్ చైర్మన్ సియ్యాదుల అచ్యుత్ తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాగరదుర్గ, సింహాద్రి ఆస్పత్రి ఎండీ కృష్ణ, డాక్టర్లు శుభకర్, దీపిక, ఫాతిమా, నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని మంగవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్స్ రూల్స్‌పై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జోగారావు మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతోపాటు వివిధ యాప్‌లు, సైబర్ క్రైమ్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

20న వడ్డాదిలో లోకేశ్ శంఖారావం సభ

▸ విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు నాయకులు పిలుపు



సమావేశంలో తాతయ్యబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, మల్లునాయుడు తదితరులు

చోడవరం, ఫిబ్రవరి 12 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం బహిరంగ సభ ఈ నెల 20న బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో జరగనుందని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సభను నాయకులు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. దీనిపై గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, భూతనాధు నానికుమార్, ఏడువాక లక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తుఫాన్ పరిహారం పంపిణీ ఎప్పుడు..?

బుచ్చెయ్యపేట : మిచౌంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించడంతో జగన్ ప్రభుత్వం చేస్తున్న జాప్యం రైతుల పాలిట శాపంగా మారిందని తాతయ్యబాబు అన్నారు. వడ్డాదిలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో వచ్చిన ఈ తుఫాన్ వల్ల జిల్లాలో 25 వేల ఎకరాల్లో పంట దెబ్బతినగా, జగన్ ప్రభుత్వం మాత్రం సుమారు 28 వేల మంది రైతులకు చెందిన 16 వేల ఎకరాల్లో మాత్రమే పంట దెబ్బతిన్నట్టుగా ప్రకటించిందన్నారు. గత ఏడాది డిసెంబర్ తొమ్మిదిన తిరుపతి, బాపట్లలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన జగన్ సంక్రాంతిలోపు నష్టపరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చినా నేటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాల్సిందిగా కోరారు.

'రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన'



మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణను పరామర్శిస్తున్న గవిరెడ్డి, పీవీజీ కుమార్

చీడికాడ, ఫిబ్రవరి 12 : అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలలో దేశంలోనే ఆంధ్ర ప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవి రెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జి పీవీజీ కుమార్ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో సోమవారం ఉదయం ప్రారంభమైన పాదయాత్ర పెదగోగాడ, చెట్టు పల్లి, చుక్కపల్లి, అర్జునగిరి, చీడిపల్లి మీదుగా తురువోలు రాత్రికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి గురించి ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి అరాచకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అర్జునగిరి, చుక్కపల్లి, చెట్టు పల్లి, పెదగోగాడ గ్రామాలకు కోనాం జలాశయం నుంచి సాగునీరు కేటాయించకపోవడంతో ప్రతి ఏడాది ఆయా గ్రామాల రైతులు పంటలను నష్టపోతున్నారన్నారు. ఎన్నికల ముందు ఫోర్‌ఎల్ కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన పాలకులు కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. మరో రెండు నెలల్లో జరగనున్న ఎన్నికల్లో టీడీపీని అంతా ఆదరించి గెలిపించాలన్నారు. అనంతరం పెదగోగాడలోని స్వగృహంలో ఉన్న మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణను కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, బొబ్బాది తాతారావు, మాజీ ఎంపీపీ పాత్రిని సింహాచలం నాయుడు, కొల్లి సూరినాయుడు, పైడంనాయుడు, మజ్జి నానాజీ, గొర్లె గణేశ్, జి.ప్రసాద్, డోకల అక్కునాయుడు, డోకల సింగపూరు దేముడునాయుడు, పల్లి తాత బాబు, ఎం.అప్పలాచారి, బీశ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని బి.కింతాడ నుంచి మంగళవారం పాదయాత్ర ప్రారంభం కానుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, జనసేన నాయకుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయమే లక్ష్యంగా అంతా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చెరకాన సూర్యనారాయణ, పాచిలి కృష్ణ, సాంబమూర్తి, కర్రి నాయుడు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : చెట్టుపల్లిలో చేపడుతున్న మోదమాంబ ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామా నాయుడు తన సొంత నిధులు రూ.పది వేలను సోమవారం అందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అంతా భాగస్వాములు కావాలన్నారు. నాయకులు పీవీజీ కుమార్, మాజీ సర్పంచ్ పాతాళం ఎర్రునాయుడు పాల్గొన్నారు.

'రోడ్డు భద్రత పాటిస్తే ప్రమాదాలు దూరం'

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 12 : ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ డి.ఈశ్వరరావు సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం మహిళా సమైక్య సభ్యులతో కలిసి ఇక్కడ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు విధిగా హెల్మెట్ ధరించాల సూచించారు. కార్లపై ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటాచార్యులు, తహసీల్దార్ శ్రీకాంత్, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, ఐకేపీ ఏపీఎం బాలరాజు, సీసీఎస్, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

జీపు బోల్తా : ఇద్దరు గిరిజనులు మృతి

▸ మరో 11 మందికి గాయాలు - సంపంగిపుట్టు వద్ద ఘటన



సంపంగిపుట్టు బ్రిడ్జి వద్ద బోల్తాపడిన సర్వీస్ జీపు

చింతపల్లి, ఫిబ్రవరి 12: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీ సంపంగిపుట్టు వద్ద ఓ జీపు అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరు గిరిజనులు మృతిచెందారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కుడుముసారి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల గిరిజనులు సోమవారం అన్నవరం వారపు సంతకు వచ్చారు. సంతలో అవసరమైన సరకులు కొనుగోలు చేసుకుని సాయంత్రం స్వగ్రామాలకు సర్వీసు జీపులో తిరుగు ప్రయాణమయ్యారు. అన్నవరం నుంచి 12 మంది గిరిజనులతో తమ్మంగుల బయలుదేరిన జీపు సంపంగిపుట్టు బ్రిడ్జి మలుపు వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మెరకలు గ్రామానికి చెందిన జర్త చిన్నమ్మ (60) అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన మిగిలిన వారిని 108లో లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మెరకలు గ్రామానికి చెందిన వంతల అప్పారావు (55) మృతిచెందారు. క్షతగాత్రులకు కాళ్లు, చేతులు విరిగిపోయాయి. కొంతమందికి తల, ఛాతీ భాగాల్లో బలమైన గాయాలయ్యాయి. గాయపడిన వారికి లోతుగెడ్డ, కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు లక్ష్మీకాంత్, ఎల్.శివప్రసాద్ ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం పీహెచ్‌సీ అంబులెన్స్, 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఏదీ చి(చె)త్త శుద్ధి!

▸ చాలా గ్రామాల్లో రోడ్ల పక్కన, వంతెనల వద్ద పేరుకుపోతున్న చెత్తాచెదారం

▸ పట్టించుకోని అధికారులు ▸ దుర్వాసనతో జనం అవస్థలు ▸ కొన్నిచోట్ల నిప్పు పెడుతుండడంతో ఉక్కిరి బిక్కిరి

▸ పారిశుధ్య సమస్యకు చెక్ పెట్టేందుకు ఏర్పాటైన సంపద కేంద్రాలు పలు చోట్ల నిరుపయోగం



వాడపాడులోని పెద్దేరు వంతెన వద్ద చెత్తా చెదారానికి నిప్పుపెట్టిన దృశ్యం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 12 : సంపద కేంద్రాలపై ప్రభుత్వం పలుచోట్ల శీతకన్ను వేస్తుండడంతో చాలా గ్రామాల్లో రోడ్ల పక్కన, వంతెన సమీపాల్లో చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోతోంది. వీటిని తరలించే నాథుడు లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల నిప్పు పెడుతుండడం కొత్త సమస్యలకు కారణమవుతోంది. మండలంలోని వాడపాడు- జంపెన గ్రామాల మధ్య గల పెద్దేరు ఏటి ప్రవాహంపై నిర్మించిన వంతెన వద్ద చెత్తా చెదారం పేరుకుపోతోంది. అలాగే ఘాట్‌రోడ్డు జంక్షన్‌లోని పలు



దుకాణదారులు చెత్తాచెదారం పారబోస్తున్నారు. పంచాయతీకి చెందిన గ్రీన్ అంబాసిడర్లు చెత్తను సేకరించి వంతెన వద్ద పారబోస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడి చెత్తకు నిప్పు పెడుతున్నారు. దీంతో పొగ అంతా కమ్ముకుని అటుగా రాకపోకలు సాగించేవారు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ఎరువుగా తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయిస్తారనుకుంటే.. ఇలా ఇష్టారాజ్యం పారబోస్తుండడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని సంపద కేంద్రాలకు తరలించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో వృథాగా పడి ఉన్న చెత్త బుట్టలు

నెల రోజులుగా కార్యాలయంలోనే చెత్త బుట్టలు



మాకవరపాలెంలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం

మాకవరపాలెం, ఫిబ్రవరి 12 : గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి ఎట్టకేలకు ప్రభుత్వం సరఫరా చేసిన చెత్తబుట్టలు నెల రోజులుగా మండల పరిషత్ కార్యాలయానికే పరిమితమయ్యాయి. ఇంటికి రెండు చొప్పున ఈ బుట్టలను పంపిణీ చేయాలని భావించి ప్రభుత్వం నెల రోజుల కిందట 2,100 బుట్టలను ఇక్కడికి పంపించింది. అయితే ఇవి కార్యాలయంలో వృథాగా పడి వున్నాయి. ఇళ్లలోని తడి, పొడి చెత్తను ఈ రెండు బుట్టల్లో వేర్వేరుగా వేసి పారిశుధ్య సిబ్బంది ఇంటికి వచ్చినపుడు వాటిని అందించాల్సి ఉంది. సదరు సిబ్బంది టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సంపద కేంద్రాలకు తరలించి, అక్కడ ఈ చెత్తను ఎరువుగా తయారు చేసి తిరిగి రైతులకు తక్కువ ధరకు విక్రయించాల్సి ఉంటుంది. దీని వల్ల గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారంతో పాటు పంటలకు నాణ్యమైన ఎరువు తక్కువ ధరకు అందుతుందని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం. ఆ మేరకు పంచాయతీల్లో సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వీటిపై నిర్లక్ష్యం చూపింది. ఆ తరువాత ఈ కేంద్రాల వల్ల ప్రయోజనాన్ని గుర్తించి పలుచోట్ల పనిచేసేలా చర్యలు చేపట్టింది. కానీ ఇలా కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల కొన్నిచోట్ల పెద్దగా లక్ష్యం నెరవేరడం లేదు. ఫలితంగా మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ చెత్త బుట్టలు మగ్గుతున్నాయి. దీంతో కొందరు ఇంట్లోని చెత్తాచెదారాన్ని ఇళ్ల సమీపంలోని, రోడ్లపై పారబోస్తున్నారు. ఈ కారణంగా అటుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి చెత్త బుట్టలను పంపిణీ చేయాల్సిందిగా గ్రామస్థులు కోరుతున్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం : ఆర్డీవో

నర్సీపట్నం, ఫిబ్రవరి 12 : స్పందనలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్‌వీ జయరాం సూచించారు. సోమవారం ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నర్సీపట్నంలోని శారదానగర్ మదుం సమీపంలో గల పెద్ద చెరువుకు సంబంధించిన గెడ్డను మట్టితో కప్పుతున్నారని వెంటనే ఆపాలని బలిఘట్టానికి చెందిన మాజీ ఎంపీటీసీ శెట్టి మాణిక్యం, టీడీపీ నాయకుడు గవిరెడ్డి రమణ ఫిర్యాదు చేశారు. దీని వల్ల పెద్దచెరువు పొర్లు నుంచి ధర్మసాగరం వరకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడతారన్నారు. అలాగే, గొలుగొండ మండలం పాత మల్లంపేట శివారు సర్వే నెంబరు 473లో గెడ్డ పోరంబోకు స్థలం ఆక్రమణకు గురవుతుందని చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధి మురళీ ఫిర్యాదు చేశారు. నర్సీపట్నం క్లబ్ ఆవరణలోని గ్రామ కంఠం స్థలంలో మునిసిపాలిటీ అనుమతులు లేకుండా కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేశారు. క్లబ్‌ను రిక్రియేషన్ కోసం వినియోగించాలని, అందులో భారీగా పేకాట నిర్వహిస్తున్నారని ఆర్డీవోకు మురళీ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్‌లను ఆర్డీవో ఆదేశించారు. రోలుగుంట మండలం వడ్డిప గ్రామానికి చెందిన ఎం.లక్ష్మి వితంతు పింఛను మంజూరు చేయించాలని వేడుకుంది. కోటవురట్ల మండలం కొడవటిపూడి గ్రామంలోని 2.56 ఎకరాల భూమికి సంబంధించి ఇ-పాస్ పుస్తకాన్ని ఇప్పించాల్సిందిగా ఎ.నాగదేవి అనే మహిళ అర్జీని అందజేసింది.

గర్నికంలో బాలచెంచమ్మ కలశాలు, ఘటాల ఊరేగింపు



పూజలందుకుంటున్న అమ్మవారు



బాలచెంచమ్మ కలశాలు, ఘటాల ఊరేగింపు

రావికమతం, ఫిబ్రవరి 12 : మండలంలోని గర్నికంలో బుధవారం బాలచెంచమ్మ తల్లి తీర్థం జరగనుంది. అనకాపల్లి, పాడేరు, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రానున్న నేపథ్యంలో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామ పుర వీధుల్లో అమ్మవారి కలశాన్ని ఊరేగించారు. ఈ వేడుకను పురస్కరించుకుని 250మంది భక్తులు అమ్మవారి మాలాధారణ చేసి, గత 21 రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారంతో వీరి దీక్ష పూర్తికావడంతో అమ్మవారి కలశాల ఊరేగింపులో పాల్గొన్నారు.

చీకటి జీవోల ద్వారా రైతులను మోసం చేయడంలో 'బూడి' దిట్ట

▸ పెద్దేరు రిజర్వాయర్ కాలువల అభివృద్ధికి హామీ

▸ కార్యరూపం దాల్చకపోవడంతో పంటలకు అందని నీరు

▸ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

మాడుగుల, ఫిబ్రవరి 12 : చీకటి జీవోలను సృష్టించి, రైతులను మోసం చేయడంతో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దిట్ట అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. సోమవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ మాడుగుల మండలంలో పెద్దేరు రిజర్వాయర్ ఎడమ కాలువ ఆధునికీకరణను రూ.84.04 కోట్లతో చేపడతామని, అలాగే రూ.9.5కోట్లతో కుడి కాలువ నాలుగు ఎల్‌పి ద్వారా ఎల్.గంగవరం, ఓంద్రువీధి, ఎల్.కృష్ణాపురం, గదబవీధి, పాత గవరవరం, కామకూటం, కొండలపాడు, కొండవీధి, పలు గిరిజన గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు పనులను పూర్తిచేస్తామని చీకటి జీవోలను తీసుకొచ్చి రైతులను అన్యాయం చేశారని మండిపడ్డారు. సకాలంలో పనులు జరిగి ఉంటే వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు రిజర్వాయర్ ద్వారా పంట పొలాలకు నీరు అందేదని, తద్వారా పంటలు పుష్కలంగా పండి ఉండేవని వివరించారు. నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి దారుణంగా ఉందన్నారు. అభివృద్ధి పనులను పక్కనబెట్టి ఎన్నికల ప్రచారానికి ముత్యాలనాయుడు ఎలా వెళతారని ప్రశ్నించారు. వీటన్నింటినీ గమనిస్తున్న ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓట్లు ద్వారా సరైన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు.

నేడు జనసేన పార్టీ బాధ్యుల ప్రమాణం

చోడవరం, ఫిబ్రవరి 12 : నియోజకవర్గ పరిధిలో జనసేన ప్రకటించిన పార్టీ బాధ్యుల ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం పట్టణంలో జరగనుంది. జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి అల్లం రామప్పారావు, జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అల్లం రామ ప్పారావు విజ్ఞప్తి చేశారు.

మహిళలకు 'ఆసరా' చెక్కులు పంపిణీ

నాతవరం/గొలుగొండ, ఫిబ్రవరి 12 : మండల కేంద్రం నాతవరంలో సోమవారం డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే గణేశ్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు చెప్పారు. నాతవరంలో జూన్ నుంచి జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభం కానున్నట్టు చెప్పారు. ఎంపీపీ లక్ష్మణమూర్తి జడ్పీటీసీ అప్పలనర్స, పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టర్ పైల పోతురాజు, ఎంపీడీవో రాంబాబు వెలుగు ఏపీఎం ఎం.లక్ష్మి, వైస్ ఎంపీపీలు షైనం నాగగోపీ, పైల సునీల్, వైసీపీ నాయకులు కరక అప్పలరాజు సర్పంచ్ గొలగాని రాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే, గొలుగొండలో డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే గణేశ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జడ్పీటీసీ సుర్ల వెంకటగిరిబాబు, ఎంపీడీవో రమాకుమారి, వెలుగు ఏపీఎం మంగ, వైస్ ఎంపీపీలు జక్కు నాగమణి, సుర్ల ఆదినారాయణ, వైసీపీ నాయకులు పత్తి రమణ, లెక్కల సత్యనారాయణ, లోచల సుజాత తదితరులు పాల్గొన్నారు.

మల్లాం మరుభూమిలో విగ్రహాల ఆవిష్కరణ



బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 12 : మల్లాంలో గల రుద్రభూమిలో ఓ దాత సహాయంతో పరమ శివుడు, హరిశ్చంద్ర విగ్రహాలను సోమవారం ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన బొట్టా మారాజు రూ.లక్షా యాభై వేలు తన సొంత నిధులను వెచ్చించి ఈ విగ్రహాను చేయించారు. తొలుత గ్రామ పురవీధుల్లో ఊరేగించి, పూజల అనంతరం ఆవిష్కరించారు. మారాజును సర్పంచ్ బర్ల శివ, మాజీ సర్పంచ్‌లు మువ్వల అప్పారావు, గొలగాని శ్రీనివాసరావు అభినందించారు.

పది లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

గొలుగొండ, ఫిబ్రవరి 12 : పది లీటర్ల సారాతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. మండలంలోని జమ్మాదేవిపేటకు చెందిన కూడా సోంబాబు నాటు సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం మేరకు సోమవారం దాడి చేశామన్నారు. అతడి వద్ద పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

కె.కోటపాడు : మండలంలోని కొత్త అగ్రహారం శివారు పాలబంద గెడ్డ వద్ద సారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఐదు వందల లీటర్ల బెల్లం ఊటను సోమవారం ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు.

'ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి'



నర్సీపట్నంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో జయరాం, సిబ్బంది

నర్సీపట్నం, ఫిబ్రవరి 12 : త్వరలో జరగనున్న ఎన్నికల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆర్డీవో జయరాం సూచించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్వీప్ కార్యక్రమంలో నియోజవర్గంలోని 24 మంది సెక్టార్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నైతిక విలువతో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. అధిక శాతం మంది పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాములు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మాడుగులలో అవగాహన సదస్సు

మాడుగుల రూరల్ : ప్రజలంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ కోరారు. సోమవారం పలువురు ఉద్యోగులకు ఇక్కడ ఏర్పాటైన సదస్సులో ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీలను చేతబట్టి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ రాజా, సీనియర్ అసిస్టెంట్ పూర్ణయ్య, ఆర్ఐలు వెంకటేశ్, నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రోలుగుంట : త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ రవిచంద్ర తెలిపారు. సోమవారం మండలంలోని కొవ్వూరు, కె.నాయుడుపాలెం గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యుత్, ఫర్నీచర్, నీటి వసతి, మూత్రశాలలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపులను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని కేంద్రాలను పరిశీలించి నివేదికలు సమర్పించనున్నట్టు చెప్పారు. డీటీ అప్పారావు పాల్గొన్నారు.

'పేట' వైసీపీలో అసమ్మతి గళం

... 5వ పేజీ తరువాయి

జరగడంతో అమ్మాజీ తీవ్రఅసంతృప్తికి గురైనట్టు తెలిసింది. కాగా నిరసన ర్యాలీ సందర్భంగా కొంతమందిని 'ఆంధ్రజ్యోతి' పలుకరించగా, స్థానికురాలైన పెదపాటి అమ్మాజీకి కాకుండా వేరే జిల్లాకు చెందిన జోగులను సమన్వయకర్తగా నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అమ్మాజీకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తుక్కుగా చెత్త వాహనాలు

... 5వ పేజీ తరువాయి

వినియోగంలో వున్నాయి. ఇంచుమించు ఏడాది కాలంగా ఇదే పరిస్థితి. ఆటోల బ్యాటరీలకు చార్జింగ్ పెట్టడం లేదు. ఇవీ కూడా తుప్పు పట్టి పనికిరాకుండా పోయే పరిస్థితి నెలకొంది.

అద్దె ట్రాక్టర్లకు ఏటా రూ.60 లక్షలు చెల్లింపు

మునిసిపాలిటీకి చెందిన చెత్త తరలింపు వాహనాలు ఒక్కొక్కటిగా మూలకు చేరుతుండడంతో అధికారులు వాటి స్థానంలో ప్రైవేటుగా అద్దె ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో అద్దె ట్రాక్టర్లకు రూ.60 లక్షలు చెల్లించనున్నట్టు అంచనా వేశారు. ఒక్కో ట్రాక్టర్ ఖరీదు సుమారు 10లక్షలు వుంటుంది. మూడేళ్ల నుంచి అద్దె ట్రాక్టర్లను వినియో గిస్తున్నారు. ఈ డబ్బులతో మునిసిపాలిటీకి చెందిన వాహనాలకు మరమ్మ తులు చేయించవచ్చు, మిగిలిన డబ్బులతో కొత్త వాహనాలు కొనుగోలు చేయవచ్చు. కానీ మునిసిపల్ అధికారులు, పాలకులు ఆ దిశగా ఎందుకు ఆలోచిం చడంలేదని ప్రజలు టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మునిసిపల్ కౌన్సిల్ సమా వేశాల్లో పలుమార్లు ప్రశ్నించారు. కాగా చెత్త తరలించే వాహనాలు మూలకు చేరడం, వాటిని బాగు చేయించకపోవడంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును వివరణ కోరగా, పాడైన వాహనాలకు మరమ్మతుల చేయిం చాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు.



పాత సచివాలయం వెనుక పాడైన ట్రాక్టర్

150 మందికి వైద్య పరీక్షలు



పరీక్షలు జరుపుతున్న వైద్యులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 12 : ఎం.అల మండలో అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 150 మందిని పరీక్షించి, ఇందులో పది హేను మందిని మెరుగైన వైద్య సేవల కోసం ఎంపిక చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. వైద్యులు మౌనిక, పోతల పాత్రునాయుడు, ఈశ్వరరావు, సాంబ పాల్గొన్నారు.

హైవే భూముల్లో గ్రావెల్ దందా

... 5వ పేజీ తరువాయి

రూ.3-4 వేలు, డంపర్ అయితే రూ.5-6 వేలు తీసుకుంటున్నారు. కాగా గతంలో రోడ్డు నిర్మాణ సంస్థ, ప్రభుత్వం సేకరించిన భూముల్లో అక్కడక్కడా వున్న గోతులను ఫ్లైయాష్‌తో పూడ్చారు. అక్రమార్కులు దీనికి కూడా వదిలి పెట్టకుండా తరలించుకుపోతున్నారు.

సూరెడ్డిపాలెంలో జాతీయ రహదారి రింగు రోడ్డు కోసం సేకరించిన భూముల్లో కొంతకాలం నుంచి గ్రావెల్, మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ విజిలెన్స్, మైన్స్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి మట్టి, గ్రావెల్ సరిపడ లభించక, పరవాడలోని సింహాద్రి ఎన్టీపీసీ పవర్ ప్లాంట్ నుంచి ఫ్లైయాష్‌ను తీసుకువచ్చి వినియోగిస్తున్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎన్‌హెచ్ఏఐ భూముల్లో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.